క్లుప్తంగా

పింఛన్, నిత్యావసర సరకుల అందజేత



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల నెలా అందించే పింఛన్లు పంపిణీ చేశారు. వీటితో పాటు రవాణా చార్జీలు అందించారు. అలాగే మృతిచెందిన పింఛన్‌దారు కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుగా రూ.2వేలు అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న ఓ కుటుంబానికి ట్రస్ట్ ప్రతినిధి పిళ్లా శ్రీనివాసరావు సహకారంతో నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, ట్రస్ట్ చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి, గంధోళి నరసింగరావు, శీరంశెట్టి గోవిందరావు, బొండా ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



నడుపూరు వెంకటరావు మృతదేహం

పెదగంట్యాడ: మండలంలోని సమతానగర్ షిర్డీ శాంతిధామం సమీపంలో శనివారం కొబ్బరిచెట్టు పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. న్యూ పోర్టు పోలీసులు అందించిన వివరాలివి.. మండలంలోని నడుపూరులో నడుపూరు వెంకటరావు (48) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వర్తించేవాడు. నాలుగు నెలల కిందట స్టీల్‌ప్లాంట్‌లో విధుల నుంచి తొలగించడంతో కూలి పనులకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో సీతానగరం ప్రాంతానికి చెందిన అచ్చంనాయుడు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఆయనతో కలిసి వెంకటరావు కొబ్బరి కాయలు తీసేందుకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం కూడా వెంకటరావు కొబ్బరికాయలు తీసేందుకు వెళ్లాడు. అయితే శనివారం వర్షం పడడంతో కొబ్బరి చెట్టు ఎక్కిన తర్వాత పట్టు జారి ఒక్కసారిగా కిందపడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య నడుపూరు మణి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



పెంటయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం : పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగంగా యాచకులను పునరావాస కేంద్రాలకు తరలించారు. భీమనగర్ పురుషుల నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న పిల్లి పెంటయ్య (68)ను శనివారం సాయంత్రం టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్ని రోజులుగా ఇల్లు విడిచి తిరుగుతున్న పెంటయ్యను గుర్తించి పోలీసులు ఇక్కడికి తీసుకొచ్చారు. పెంటయ్య వివరాలను సీఐ ఎర్రం నాయుడు ఆరా తీయగా... కంచరపాలెం ప్రాంతానికి చెందిన వాడిగా తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించారు. సీపీకి, సీఐకి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు తదితరులు



నడుపూరులో సంతాన వేణుగోపాలస్వామి సన్నిధిలో పూజలు



చట్టివానిపాలెంలో పూజలు చేస్తున్న కృష్ణారెడ్డి, కార్పొరేటర్ చందు



ఊరేగింపులో ఉత్సవమూర్తులు

కృష్ణా.. ముకుందా.. మురారీ..

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులు



సత్యసాయి బాలవికాస్‌లో చిన్నారుల సందడి



కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు



కృష్ణుడిగుడిలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



బాలగోపాలంతో ఆటలాడుతున్న గోపికలు



గోపిక వేషధారణలో చిన్నారి



కృష్ణుడి వేషధారణలో చిన్నారి



పోటీపడి ఉట్టి కొడుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: శ్రీకృష్ణ జన్మాష్టమిని గాజువాక నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. చిన్ని కృష్ణులు సందడి చేశారు.. బుజ్జి బుజ్జి గోపికలు వారిని ఆటపట్టించారు. చిన్ని చిలిపి చేష్టలు అలరించాయి. వేకువజాము నుంచి శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు ఫల, పంచామృతాభిషేకాలు చేశారు. వెన్న, పలు రకాల ఫలాలతో మూలవిరాట్‌ను అలంకరించారు. గోపూజ, విష్ణు సహస్రనామ పారాయణ, శ్రీకృష్ణ కీర్తనలు ఆలాపన చేశారు. పలు ఆలయాల్లో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం సందడిగా నిర్వహించారు. అనంతరం శ్రీ కృష్ణుడి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి గ్రామాల్లో ఊరేగించారు. ఊరేగింపులో కోలాటాలు, భజనలు చేశారు.

- జీవీఎంసీ 75వ వార్డు ముసలినాయుడుపాలెంలోని వంశీకృష్ణ దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కిల్లాన ముసలయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. శ్రీకృష్ణ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, పలువురు కార్పొరేటర్లు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెంటారావు, జిలకర్ర భువనేశ్వరి, శంకర్రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంతాన గోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అధ్యక్షుడు సీర సోమునాయుడు, కార్యదర్శి శివకృష్ణ, సీర నాగేంద్ర ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తి శ్రద్ధలతో విశేష పూజలు,అర్చనలు చేశారు. బాలకృష్ణుడి ఉత్సవ విగ్రహాలను నడుపూరు పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు.
- సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి థామంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లి సత్యంబాబు,వైస్ చైర్మన్ రవిశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

సందడిగా కృష్ణాష్టమి

కూర్మన్నపాలెం: కృష్ణాష్టమి వేడుకలను శనివారం 87వ వార్డులో ఘనంగా నిర్వహించారు. వార్డులోని అప్పికొండ దేవాలయాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాగిరెడ్డి మాట్లాడుతూ లోకరక్షకుడైన శ్రీకృష్ణుడు ప్రజలకు తమ ఆశీస్సులు అందజేయాలని అభిలషించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్, దానప్పలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు అదిరె

అగనంపూడి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పలు ఆలయాలు, మండపాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. 79, 85 వార్డుల్లోని పలు ఆలయాల్లో వేదపండితులు శ్రీకృష్ణజన్మ రహస్యం, రాధాకృష్ణుల వివాహం తదితర అంశాలను వివరించారు.

- 85వ వార్డు దిబ్బపాలెం కృష్ణ మందిరంలో ఘనంగా పూజలు నిర్వహించారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు రమాదేవి దంపతులు పాల్గొని విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యలమంచిలి పెద అప్పారావు పాల్గొన్నారు.
- చట్టివానిపాలెంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో కార్పొరేటర్ ఉరుకూటి చందు, బీజేపీ రాష్ట్ర నాయకులు కొయ్య వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వందలాది మంది ఉత్సవాల్లో పాల్గొన్నారు.
- సెక్టార్-1 పినమడకలోని కృష్ణ మందిరంలో గరవ సోమశేఖర్, కర్రి దోశేంద్రరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.
- దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ కృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు. బాలకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం ఉట్ల సంబరాలు వేడుకగా సాగాయి.
- ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ ఎదురువానిపాలెంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీ రామునాయుడు, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, కర్రి దోశేంద్ర, గరవ సోమశేఖర్, బోర సోమునాయుడు పాల్గొన్నారు.
- వేడుకలను కొండయ్యవలసలోని సత్యసాయి బాల వికాస్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బాలలు రాధాకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. శ్లోకాలు ఆలపించారు. ఉట్ల సంబరాల్లో హుషారుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బాల వికాస్ గురువులు అల్లం రమాదేవి, విందుల పద్మావతి, త్రివేణి, రాజేశ్వరి, బలిరెడ్డి సత్యనారాయణ, గోవిందరావు పాల్గొన్నారు.



పినమడక కృష్ణాలయంలో పూజలు..



ఫార్మాసిటీ కాలనీలో కృష్ణాష్టమి వేడుకలు

సందడే సందడి



గోపాలుడి వేషధారణలో చిన్నారి

ఉక్కునగరం: కృష్ణాష్టమి వేడుకలు ఉక్కునగరంలో ఘనంగా జరిగాయి. వివిధ పాఠశాలల్లో నిర్వహించిన గోపిక, గోపాలుడి పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలబాలికలతో పాటు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తత్కాల్ కౌంటర్ వద్ద తంటాలు

- అదనపు కౌంటర్ ఏర్పాటు చేయాలని వినతులు



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో తత్కాల్ టికెట్ కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు తత్కాల్ టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే ఉన్నతాధికారులను కోరారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు మరో కౌంటర్ ఏర్పాటు చేస్తే సబ్బవరం, గాజువాక, పరవాడ మండలాలకు చెందిన ప్రయాణికులు అందుబాటులో ఉంటుందన్నారు. తత్కాల్ టికెట్ కోసం ముందురోజు బుకింగ్ కౌంటర్ వద్ద అమర్చిన తెల్ల కాగితంపై పేరు, ఆధార్ నంబర్ రాసిపెట్టి మరుసటి రోజు ఉదయం కౌంటర్ ప్రారంభించే సమయానికి వస్తే ఆ క్రమంలో టికెట్లు జారీ చేసేవారు. అయితే వారం రోజుల నుంచి ఈ విధానానికి స్వస్తి పలకడంతో టికెట్ కోసం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు కౌంటర్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.జాషువ, కంచుమూర్తి ఈశ్వర్ పేర్కొన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తత్కాల్ కౌంటర్లు నిర్వహించాలని కోరారు. ప్రయాణికుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు.

పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, సభ్యులు

టీచ్‌రోడ్డు : దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల ఓటు హక్కు ఖూనీని కేంద్ర ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ బిహార్‌లో ఎన్నికల కమిషన్ 65 లక్షల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే అన్నారు. ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు చెల్లుబాటు కావని చెప్పడం, ఓటరే పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఈసీ జారీ చేసిన ఓటర్ గుర్తింపు కార్డుతో దశాబ్దాలుగా ఓట్లు వేస్తున్న వారికి, ఇప్పుడు ఆ గుర్తింపు కార్డు చెల్లుబాటు కాదని ప్రకటించడం సరికాదన్నారు. ఈ అక్రమ నిబంధనలు రద్దు చేయాలని, పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈడీ, సీబీఐలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం తీవ్రం చేసిందన్నారు. స్వతంత్రంగా వ్యవహరిస్తూ, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని... కేంద్ర ప్రభుత్వ తీరుతో ఈసీ స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎన్నికల వ్యవస్థను కూడా తమకు అనుకూలంగా మార్చుకుని దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం ప్రకారం దేశంలో అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల ఓట్ల తొలగింపు కేవలం బిహార్, కర్ణాటక, మహారాష్ట్రకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా ఇటువంటి అక్రమాలకు పాల్పడతారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా నడుము బిగించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.మణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీ పాలనను ప్రజలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు .

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకటేష్ గౌడ్ తదితరులు



లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

కూర్మన్నపాలెం: సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.87వ వార్డు శెట్టిబలిజ వీధిలోని లచ్చన్న విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తరాంధ్ర ప్రజల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు, బొడ్డగోవింద్, దామోదర్, దానప్పలు, గోవిందరాజులు, కోమటిరమాదేవి, గెద్దాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

- అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు రాము తదితరులు గౌతులచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రగడ వేణు, రాంబాబు, కాకామధు, అంగటి నూకరాజు పాల్గొన్నారు. అలాగే వార్డు కార్పొరేటర్ బొండా జగన్ నేతృత్వంలో పలువురు నాయకులు పాల్గొని సర్దార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పెదగంట్యాడ: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేమని గీత సహ కులాల యువజన సంఘం అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని షీలానగర్ జంక్షన్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అల్లు రమణారావు, శివప్రసాదరావు, అత్తిలి లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరాజు, కాకి లోకేష్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ఘనంగా శ్రావణ పూజలు



సిరులతల్లికి తులసి దళాలతో పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు శనివారంతో 23వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాద స్వరాల మధ్య పూజలు ప్రారంభించారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు, ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.